లంక గ్రామాల్లో గుబులు

- మళ్లీ ముంచెత్తుతున్న వరద
- ఆందోళన చెందుతున్న రైతులు

మామిడికుదురు: గోదావరి వరద మళ్లీ లంక గ్రామాలను ముంచెత్తుతోంది. ధవళేశ్వరం వద్ద గంట గంటకు పెరుగుతున్న వరద తీరంలోని లంక గ్రామాలపై ప్రభావం చూపుతోంది. అప్పనపల్లి కాజ్వేకు రెండు వైపులా శనివారం వరద నీరు చుట్టు ముట్టింది.

అప్పనపల్లి స్నానాల రేవులో వరద నీరు పోటెత్తడంతో వరద నీటిలో తీవ్ర ఇబ్బందులు పడుతూ భక్తులు స్నానాలు ఆచరించారు. వరద మరింత పెరిగే అవకాశం ఉండడంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మళ్లీ ముంపు భారిన పడే అవకాశం ఉంది. దీంతో మూడు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పెదపట్నం మధ్యలంకలోని పసుగ్రాసం, కూరగాయల తోటలు ముంపు భారిన పడ్డాయని రైతులు వాపోయారు. దీంతో పాటు పెదపట్నంలంకలోని కూరగాయల తోటలు సైతం ముంపునకు గురయ్యాయి.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మూడో సారి వరదలు రావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆగ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. అలాగే కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్వే మునిగిపోవడంతో అక్కడ ప్రజలు పడవలపై వెళ్తున్నారు. పశువులను ఏటిగట్లపైకి తరలించారు. పశుగ్రాసానికి కొరత ఏర్పడటంతో లంక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి


బూరుగులంక రేవులో పడవపై ప్రయాణిస్తున్న లంక గ్రామాల ప్రజలు


ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

నీటమునిగిన కాజ్వే

అయినవిల్లి: వరద ఉధృతికి మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్వే పైకి నాలుగు అడుగుల మేర వరద చేరింది. దీంతో ఈ కాజ్వే పైన మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామాలకు రాకపోకలకు స్తంభించాయి. అలాగే ముక్తేశ్వరంలోని వృద్ధగౌతమిపాయ (తొగరపాయ)లో వరద ఉధృతిగా ప్రవహిస్తుంది. వృద్ధగౌతమి శ్మశానవాటిక నీట మునిగింది. దీంతో అంతిమ సంస్కారాలు నిర్వహణ కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతికి మండలంలోని లంక గ్రామాల్లోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, మడుపల్లిలంక, చింతనలంక, పొట్టిలంక, శానపల్లిలంక, కొండుకుదురులంక గ్రామాలలోని పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. దీంతో అ గ్రామాలలోని పల్లపు ప్రాంతాల్లో ఉన్న కూరగాయ, అరటి, మొక్కజొన్న, తమలపాకు, కోకో పంటలు వరదనీట మునిగాయి. వరద ఉధతికి పల్లపు ప్రాంతాల్లో ఉన్న పశువులను రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే కొబ్బరి రాశులను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఉద్యోగులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు: గోదావరి వరద హెచ్చరికల నేపథ్యంలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్ సూచించారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం వరద పరిస్థితిపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర ఉద్యోగులతో అధికారులు సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తత పాటించాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే దాన్ని తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. గోగన్నమఠం-బెండమూర్లంక, కరవాక-ఓడలరేవులో బోట్ల ద్వారా ప్రయాణికుల రాకపోకలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా నిలిపి వేశామని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శరణ్య సమావేశంలో పాల్గొన్నారు.


మామిడికుదురులో వరదపై సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి వేణుగోపాల్

సామూహిక గణేశ ఉత్సవాలకు సహకరించాలి

రాజోలు: అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రాజోలు తాలూకా సామూహిక గణేష్ నిమజ్జనోత్సవాలకు సహకరించాలని అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ కోరారు. శనివారం రాజోలులో పలు వినాయక చవితి కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కాసు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. గత 34 ఏళ్లగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల నుంచి 150 భారీ వినాయక విగ్రహాలు రాజోలు వశిష్ట తీరానికి ఊరేగింపుగా వస్తాయన్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే వినాయక విగ్రహాలకు, ఆయా కమిటీలకు సహకరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రమశిక్షణతో సామూహిక గణేశ్ నిమజ్జనోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. నాగార్జున స్ట్రీట్ బాలగణపతి కమిటీ సభ్యులు చెల్లుబోయిన రాంబాబు, గుబ్బల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు దార్ల బాపూజీ, కాట్న రాజు, సుబుద్ధి, మాపూరి నాగబాబు, యేడిద నానాజీ, కుంపట్ల బాబి పాల్గొన్నారు.


కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కాసు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పాఠ్య పుస్తకాలకు అనుగుణంగా బోధన

రాజోలు: మారుతున్న పాఠ్యపుస్తకాలకు అనుగుణంగా బోధన చేయాలని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. శనివారం ఉపాధ్యాయులకు క్లస్టర్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజోలు, కడలి, పొన్నమండ కాంప్లెక్స్‌లకు చెందిన ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో యాప్స్‌కి సంబంధించిన సాంకేతిక అంశాలను కూడా రిసోర్స్‌పర్సన్లకు వివరిస్తారన్నారు. శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు కె.సరస్వతి, కాంప్లెక్స్ కార్యదర్శి డి.సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ గటిగంటి శ్రీనివాస్, ఉండవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మామిడికుదురు: పాశర్లపూడిలంక ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్ష ద్వారా మంజూరైన రూ.15.40 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు శనివారం శంకుస్థాపన చేశారు. స్కూల్ కాంపౌండ్ వాల్‌కు రూ.9.40 లక్షలు, ఇతర మరమ్మతులకు రూ.ఆరు లక్షలు నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ తెలిపారు. ఈ నిధులతో స్కూల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ చెరుకూరి దుర్గాప్రసాద్, ఉప సర్పంచ్ వి.రమణశ్రీనివాస్, హెచ్ఎం జి.నాగేంద్రప్రసాద్, గ్రామ పెద్ద బొరుసు కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మేధావి ఫోరం కార్యదర్శిగా హరీష్



ఆలమూరు: రాష్ట్ర వైఎస్సార్ సీపీ మేధావి ఫోరం కార్యదర్శిగా మండలంలోని పెనికేరుకు చెందిన కొడమంచిలి హరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి అదేశాలు వెలువడినట్లు హరీష్ శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ అప్పగించిన ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. రాష్ట్ర అనుబంధ కమిటీలో పదవి రావడానికి కృషి చేసిన కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బి.ఇజ్రాయెల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇరిగేషన్ స్థలం స్వాధీనం

పి.గన్నవరం: స్థానిక మూడు రోడ్ల సెంటర్లో కొబ్బరి కొట్లకు ఎదురుగా ఆక్రమణల్లో ఉన్న ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాన్ని శనివారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణలు తొలగించి సుమారు 21 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. జేసీబీలతో ఆస్థలాన్ని చదును చేశారు. ఇరిగేషన్ జేఈ బి.రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల వీవీ సత్యనారాయణ, వీఆర్వో కోరుకొండ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం భక్తులు దర్శించి, పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవస్థానం దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామికి పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,17,760, అన్న ప్రసాదం విరాళాల రూపంలో రూ.42,040తో మొత్తం రూ.1,60,800 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.

పట్టపగలే చోరీ

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామంలో తిరుమాని నాగరాజు దంపతులు శనివారం ఉదయం తమ ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో తమ హోటల్‌లో వ్యాపారం నిమిత్తం వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగల గొట్టి ఇంటిలో ఉన్న సుమారు 15 కాసుల బంగారం, రూ.25 వేల నగదు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ చెప్పారు.

గుర్రపుబగ్గీపై ఊరేగింపు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన తటవర్తి సూరిబాబు, సత్యవాణి దంపతులు తొమ్మిది నెలల తొమ్మిది రోజులు కాశీ యాత్ర చేశారు. నవ మాస దీక్ష పూర్తి చేసి శనివారం స్వగ్రామం చేరిన ఆ దంపతులకు కుటుంబ సభ్యులు, స్థానికులు, బంధువులు ఘనంగా స్వాగతం పలికారు. గుర్రపుబగ్గీపై ఊరంతా ఊరేగించారు. కేరళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాశీగంగ పూజ, కాలభైరవ పూజ, కాశీ సంతర్పణ తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపించారు.

పవన్ రుషికొండ పర్యటన ఫొటోషూట్ కోసమే..



మాట్లాడుతున్న రాష్ట్ర వైఎస్సార్ సీపీ ప్రచార విభాగ అధికార ప్రతినిధి కిశోర్

రాజోలు: విశాఖ రుషికొండపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన భవనాల్లో కేవలం ఫొటోషూట్ కోసం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెళ్లినట్టు ఉందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ ప్రచార విభాగ అధికార ప్రతినిధి తెన్నేటి కిశోర్ అన్నారు. శనివారం ఆయన రాజోలులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రుషికొండపై అద్భుతంగా నిర్మించిన పర్యాటక భవనాలను పరిశీలించి నాసిరకంగా నిర్మించారనే ముద్ర వేసేందుకు నానా తంటాలు పడ్డారన్నారు. రూ. 450 కోట్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భవనాలు నిర్మించి వాటిని పర్యాటక శాఖకు అప్పగించేందుకు గత ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. అయితే ఆ భవనాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. రాజధాని పేరిట రూ.వేల కోట్లతో అమరావతిలో తాత్కాలిక భవనాలు నిర్మించిన చంద్రబాబును పవన్ ఏనాడైనా నిలదీశారా అని ప్రశ్నించారు. గతంలో రుషికొండ నిర్మాణాలను పరిశీలించిన చంద్రబాబు, ప్రస్తుతం పరిశీలించిన పవన్ కళ్యాణ్, పలువురు మంత్రులు కూడా అద్భుతమైన కట్టడాలుగా కొనియాడారని, ప్రస్తుతం ఆ భవనాలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు అద్భుతంగా లేవని ప్లేటు ఫిరాయించి కుట్ర పన్నుతున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై పవన్‌కల్యాణ్ ధోరణి ఏంటని ప్రశ్నించారు. ఉచిత బస్సులో ఒకచోట నుంచి మరోచోటుకు ప్రయాణాలు చేస్తే మహిళలకు ఆర్థిక భరోసా ఎలా వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు సమాధానం చెప్పాలన్నారు. గతంలో మహిళా సాధికారిత కోసం రూ.వేల కోట్లను కాపు నేస్తం, ఆసరా, సున్నా వడ్డీ, డ్వాక్రా రుణమాఫీ తదితర పథకాలతో మహిళల బ్యాంక్ ఖాతాల్లో లబ్ధి జమ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సంక్షేమానికి, ఆర్థిక పురోభివృద్ధికి ఏ పథకాలు అమలు చేశారో చెప్పాలన్నారు.

వేదాలు సృష్టికి మూలం

అంబాజీపేట: వేదాలు సృష్టికి మూలమని వేద పండితులు శ్రీపాద మాణిక్య అవధాని అన్నారు. భాద్రపద మాసంలో జరిగే వేద సభల్లో భాగంగా ఇరుసుమండలో శనివారం వేదసభ జరిగింది. ఆకెళ్ళ కనకాద్రిశాస్త్రి జ్ఞాపకార్థం వేద సభను ఆయన కుమారుడు ఆకెళ్ల సత్యనారాయణ సిద్ధాంతి తన స్వగృహంలో నిర్వహించారు. మాణిక్యావధాని మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక శాస్త్రానికి సంబంధించిన నిగూఢమైన రహస్యాలు ఎన్నో ఉన్నాయన్నారు. వేదాల విశిష్టతను వివరించి వేద స్వస్తి చేశారు. అనంతరం ఆకెళ్ల అనంతలక్ష్మి పండితులను సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు బెహరా వీర హనుమంత రావు, పక్కలంక నాగేశ్వరరావు, ఆకెళ్ళ రాఘవ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్వేది దేవస్థానానికి మొక్కల వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి శనివారం సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన భక్తుడు పడాల రమేష్ రూ.లక్ష విలువ చేసే పలు రకాల మొక్కలను వితరణ చేశారు. ఈ మేరకు ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డు ప్రసాదం, చిత్రపటంను ఏసీ ప్రసాద్, దాత రమేష్‌కు ఇచ్చారు.

నేత్రదానం అందరికీ ఆదర్శం కావాలి

అంబాజీపేట: నేత్రదానం చేయడంలో ఉన్న అపోహలను విడనాడి ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేయడాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆప్తాలమిక్ అధికారి వి.ప్రభాకర్ అధ్యక్షతన అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ నేత్రదానం చేయడం వల్ల మరొకరి జీవితంలో వెలుగులు నింపుతాయన్నారు. పీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితుల స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారంగా నిర్వహించారు.

ఆలయాల అభివృద్ధికి రూ.25 వేల విరాళం

మామిడికుదురు: స్థానిక పార్వతీ రామలింగేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాల అభివృద్ధికి రిటైర్డ్ లైబ్రేరియన్ నయనాల నాగేశ్వరరావు శనివారం రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని తండ్రి సూర్యనారాయణ, తల్లి వెంకటరమణమ్మ స్మారకార్థం అందించారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు నయనాల తమ్మారావు, మొల్లేటి సత్యనారాయణ, నయనాల ప్రసాద్, నయనాల రాజుకు అందజేశారు.

నిత్యాన్నదానానికి పలువురి విరాళాలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంకకు చెందిన పోలాబత్తుల వీరబాబు రూ.10,500, అమలాపురం మండలం ఇందుపల్లికి చెందిన నంబూరి సాయి వెంకటేష్ రూ.10,116, కొత్తపేటకు చెందిన మల్లవరపు వెంకట సత్యనారాయణ రూ.10,000, హైదరాబాద్‌కు చెందిన డీఎస్ఆర్‌కేవీ ప్రసాదరావు రూ.10 వేలు మొత్తం వెరసి రూ.40,616 విరాళం అందింది. దాతలు ఈ సొమ్మును ఈఓ అల్లు వెంకట దుర్గాభవానికి అందజేశారు. దాతలను ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయక రావు, ఆలయ వేదపండితులు ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రక్తదానం

కొత్తపేట: ఒక గర్భిణికి అత్యవసర సమయంలో స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం ద్వారా రక్తదానం చేశారు. రావులపాలెం మండలం దేవరపల్లికి చెందిన గర్భిణి బుడితి లక్ష్మీప్రసన్న ప్రసవం నిమిత్తం అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఆమెకు సాధారణ ప్రసవానికి అవకాశం లేక ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. రక్తహీనత కారణంగా అత్యవసరంగా రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. ఆమె బ్లడ్ గ్రూపు ఏబీ నెగటివ్ కావడంతో ఆ రక్తం ఎక్కడా దొరక్క ఇబ్బంది పడుతుండగా కొత్తపేట వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించగా ఆయన ఆ బ్లడ్ గ్రూపు కలిగిన యోగా విద్యార్థులు దొమ్మేటి సతీష్, దంగేటి కరుణకుమార్‌లతో రక్తదానం చేయించారు. రక్తదాతలకు, యోగా శ్రీనివాస్‌కు గర్భిణి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

రాజోలు: గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వాటిని అడ్డుకోవాలని ప్యానల్ అడ్వకేట్ జేహెచ్ సాగర్ అన్నారు. శనివారం రాజోలు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి ఆదేశాల మేరకు సదస్సు ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. బాలల హక్కులు, ఇతర మహిళా చట్టాల గురించి వివరించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు

రాజోలు: ఉభయగోదావరి జిల్లాల పరిధిలో నిర్వహించిన ఓపెన్ మీట్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో శివకోటి గురుకుల పాఠశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. ఈ మేరకు శనివారం ప్రిన్సిపాల్ టి.లలితకుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులను అభినందించారు. సబ్ జూనియర్ కేటగిరిలో పి.స్పందన బంగారు పతకం, యు.సాన్విక వెండి పతకం, కె.మంజుల రజత పతకం, ఏడో తరగతి విద్యార్థినులు టి.కీర్తి, ఎం.అనురాధలు రజత పతకాలు సాధించారన్నారు. వీరంతా రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు అర్హత పొందారన్నారు. పతకాల సాధనకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ పి.రత్నకుమారిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ టి.సునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నా సేవలు మరువలేనివి

అంబాజీపేట: స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిద రంగాజానకీప్రసాద్ (చిన్న) సేవలు మరువలేనివని ఎంపీపీ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్‌లు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద చిన్న సంతాప సభ సీహెచ్‌వో బి.అప్పారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పలువురు చిన్నా చిత్రపటం వద్ద ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాలను విజయవంతంగా ముగించాలి

కొత్తపేట/అయినవిల్లి: గణపతి నవరాత్రుల అనంతరం గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు విజయవంతంగా ముగించాలని స్థానిక ఆర్డీవో పి.శ్రీకర్ ఉత్సవ కమిటీలకు సూచించారు. నిమజ్జనాల నేపథ్యంలో ఆర్డీఓ శ్రీకర్ అధికారులతో కలిసి శనివారం మండలంలోని వానపల్లిలో కాలువ రేవును, అయినవిల్లి మండలం వెలువలపల్లి, చింతనలంక, తొత్తరమూడిలోని గణేశ్ నిమజ్జన ప్రాంతాలను సందర్శించారు. గణేశ్ విగ్రహాలు నిమజ్జనం సందర్భంగా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. రేవుల వద్ద ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించి, నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా జరుపుకోవాలని సూచించారు.



